క్లుప్తంగా

నేడు స్వర్ణ కిరీటానికి గ్రామోత్సవం



దేవీచౌక్ కనకదుర్గమ్మకు చేయించిన స్వర్ణ కిరీటం

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన శ్రీకనకదుర్గమ్మకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు రూ.14 లక్షలు, భక్తులు రూ.7 లక్షలు కలిపి రూ.21 లక్షలతో నవరత్న ఖచిత స్వర్ణకిరీటం తయారు చేయించారు. కాగా మంగళవారం ఈ స్వర్ణ కిరీటానికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయం వద్ద నుంచి ఈ ఉత్సవం ప్రారంభమవుతుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

యర్రవరంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



యర్రవరంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో సీజనల్ జ్వరాలు ఎక్కువగా ఉండడంతో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో దోమల నివారణ కార్యక్రమం చేపట్టారు. వరద ముంపు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి దోమల నివారణ మందు పిచికారీ చేశారు. అనంతరం ఫీవర్, డయేరియా సర్వే నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం

ఏలేశ్వరం: స్థానిక లింగవరం కాలనీలో నిర్వహించే శ్రీదేవి నవరాత్ర ఉత్సవాలకు సోమవారం పందిరి రాట వేశారు. జేవీఆర్ ట్రస్టు చైర్మన్ జువ్విన వీర్రాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జువ్విన వీరరాఘవమ్మ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట వేశారు. వచ్చే నెల 3 నుంచి నవరాత్రులు ప్రారంభమవుతుండగా 12న విజయదశమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మైక్రో సర్వీసుల వినియోగంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సాంకేతిక నిపుణులు

గండేపల్లి: మైక్రో సర్వీసెస్ వినియోగంపై సాంకేతిక నిపుణులు, టెక్నికల్ ఆర్కిటిక్ ఎన్.కిరణ్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం మైక్రో సర్వీసెస్, నిజ సమయంలో వాటిని అమలు చేసే విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో సర్వీసెస్‌ల నిర్మాణ, వాటి ఆవశ్యకత, వాస్తవ జీవనంలో అమలు చేసే పద్ధతులు, ప్రస్తుతం టెక్నాలజీ రంగంలో జరుగుతున్న మార్పులు తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్, డీన్ పి.రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరస్వామికి విశేష పూజలు



రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి విశేష పూజలు చేస్తున్న అర్చకుడు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపిత కూచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పండితులు స్వామి, అమ్మవార్లకు సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీరమణ సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కూర కుధరడం లేదు

- కొండెక్కిన కూరగాయల ధరలు
- కంటతడి పెట్టిస్తున్న ఉల్లి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు



కిర్లంపూడిలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి

కిర్లంపూడి: కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. గత నెలరోజుల వ్యవధిలో అన్ని కూరగాయల ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. చేతినిండా డబ్బులు పటికెళ్లినా సంచి నిండా కూరగాయలు రావడం లేదని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల వరదలకు కొట్టుకుపోయాయి. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో అక్కడక్కడా తోటలు మిగిలినా దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో కూరగాయాల ధరలు కొండెక్కాయి. ఇప్పుడే ఇలా ఉంటే శ్రావణమాసం మొదలుకుని డిసెంబర్ వరకూ పండుగలు, శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో మున్ముందు ధరలు ఎలా ఉంటాయో అని కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా రానున్న రోజుల్లో కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లోనూ తగ్గిన ఉత్పత్తి

కూరగాయాల దుకాణాలకు మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయలు, మన రాష్ట్రంలో పుంగనూరు, పలమనేరు నుంచి టమాటా, కోల్‌కతా, ఇండోర్ నుంచి బంగాళదుంపలు, ఒడిశా నుంచి పచ్చిమిర్చి, తెలంగాణ నుంచి బీట్‌రూట్, క్యాప్సికమ్, క్యాబేజీ, రావులపాలెం నుంచి దొండకాయలు, దోసకాయలు ఎక్కువగా వస్తుంటాయి. ఆయా ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా కురవడంతో అక్కడ పంటలకు నష్టం వాటిల్లింది. దాంతో ఉత్పత్తి తగ్గి సరఫరా లేకపోవడంతో ఇక్కడ కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

మండలంలో..

కిర్లంపూడి మండలంలోని పలు గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరల పంటలు పండుతాయి. కాగా ఈ ఏడాది విత్తనాలు వేసిన సమయంలో వర్షాలు లేకపోవడంతో చాలా వరకూ విత్తనాలు నాటలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు కొద్దోగొప్పో ఉన్న పంటలూ కొట్టుకుపోయాయి. దీంతో మార్కెట్లో డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడంతో ఒక్కసారిగా కూరగాయాలకు గిరాకీ పెరిగింది.

ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల రేట్లు ఇలా...

కూరగాయలు	కిలో ధర
చిక్కుడు	రూ.95
ఉల్లి	రూ.60
ఆకాకర	రూ. 80
వంగ	రూ.80
బెండ	రూ.70
బీర	రూ.80
బంగాళదుంపలు	రూ.60
ఆకుకూరల కట్ట	రూ.20

ధరలు బాగా పెరిగాయి



మాది రెక్కడితే గాని డొక్కాడని కుటుంబం. నిత్యావసర సరకులతో పాటు కూరగాయాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దాంతో మార్కెట్‌లో గతంలో కేజీకి కొనే మేము ప్రస్తుతం అరకేజీ కూరగాయాలే కొనుగోలు చేయాల్సి వస్తోంది. రెండు మాసాల క్రితం టమాటా కొనుగోలు చేయాలంటే కరెంట్ షాకు తగిలేది. ఇప్పుడు ఉల్లి ధరలు కొండెక్కాయి. కిలో ఉల్లి రూ.60కి కొనుగోలు చేస్తున్నాం.
–కోసిన అప్పన్న, జగపతినగరం, కిర్లంపూడి మండలం

దిగుమతి తగ్గింది



కూరగాయాలు, ఆకుకూర ధరలు బాగాపెరుగుతున్నాయి. ఇటీవల వర్షాలకు భారీ వరదతో కూరగాయల పంటలు నీట మునగడంతో హోల్‌సేల్ మార్కెట్‌లోకి కూరగాయాల దిగుమతి తగ్గింది. దీంతో వచ్చిన కొద్దిపాటి కూరగాయాల ధరలు పెరగడంతో చిరువ్యాపారులం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
–దాడి వెంకన్నబాబు, చిరువ్యాపారి జగపతినగరం, కిర్లంపూడి

నేటి నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాలు

తుని రూరల్: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు మంగళవారం నుంచి డిసెంబర్ 31 వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రోజుకు రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం డి.పోలవరం-1, నందివంపు, 25న డి.పోలవరం-2, రేఖవానిపాలెంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అక్టోబర్ 1న రాపాక, కేఓ మల్లవరం, 3న దొండవాక, తాళ్లూరు, 8న ఎన్.సూరవరం, ఎన్ఎస్‌వీ నగరం, 9న కొలిమేరు, కుమ్మరిలోవ, 15న వి.కొత్తూరు, లోవకొత్తూరు, 16న రాజుపేట, ఎస్.అన్నవరం, 22న వల్లూరు, ఎన్.చామవరం, 23న హంసవరం-1, హంసవరం-2, 29న చేపూరు, టి.వెంకటాపురం, 30న తేటగుంట, టి.తిమ్మాపురంలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. నవంబరు 5న డి.పోలవరం-1, నందివంపు, 6న డి.పోలవరం-2, రేఖవానిపాలెం, 12న రాపాక, కేఓ మల్లవరం, 13న దొండవాక, తాళ్లూరు, 19న ఎన్.సూరవరం, ఎన్ఎస్‌వీ నగరం, 20న కొలిమేరు, కుమ్మరిలోవ, 26న వి.కొత్తూరు, లోవకొత్తూరు, 27న రాజుపేట, ఎస్.అన్నవరం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు ఏర్పాటు చేశామని వివరించారు.

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ

కోటనందూరు: మండలంలోని ఎస్సార్‌పేటలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే యనమల దివ్య ఆవిష్కరించారు. రైతులను ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు రూపొందించిందన్నారు. ఈ నెల 24 నుంచి అక్టోబర్ నెలాఖరు వరకూ అమలు జరిగే ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ బుల్లిబాబు, ఏఓ చంద్రశేఖర్, ఏఈఓ శివకుమారి, వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు తెలిపారు.

నేడు ఎలుకలనివారణ మందు పంపిణీ

ప్రత్తిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు మంగళవారం ఎలుకల నివారణ మందు ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీ యింటి వీర గంగాధర్ సోమవారం తెలిపారు. రైతులు నూనె, నూకలు తెచ్చుకుంటే వాటిలో బ్రొమోడయోలిన్ మందు కలిపి ఇస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

ప్రత్తిపాడు రూరల్: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. ఉత్తరకంచి, ధర్మవరం గ్రామాల్లోని గణేశ్ మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యువతి అదృశ్యంపై కేసు

గండేపల్లి: యువత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఏఎస్ఐ బి.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని యల్లమిల్లి గ్రామానికి చెందిన 15 ఏళ్ల యువతి ఈ నెల 18వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో తల్లితండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



తునిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శేషగిరి, రాము

తుని: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.శేషగిరి సూచించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ ఉన్నతికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము తెలిపారు. ఉపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి మణికంఠ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచి, లంపకలోవ, పెదశంకర్లపూడి, రౌతుపాలెం, ఇ.గోకవరం, ముట్టచింత, కిత్తమూరిపేట, పెద్దిపాలెం గ్రామాల్లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయ సౌజన్యంతో బీజేపీ మండల అధ్యక్షుడు కందా వీరాస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాల్లో డాక్టర్లు 100 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. కంటిలో శుక్లా ఉన్న 35 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం వేమగిరి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఇంటి వీరనాగేశ్వరరావు జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ఈర్లదేవి, శక్తి కేంద్రం ఇంచార్జ్ రెడ్డి శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద బందోబస్తు

గోకవరం: గుమ్మళ్లదొడ్డి పంచాయతీ పరిధిలోని అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఫ్యాక్టరీ నుంచి దుర్వాసన రావడంతో అనారోగ్యానికి గురతున్నామని గ్రామస్తులు ఆదివారం రాత్రి ఆందోళన చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కాగా సోమవారం ఫ్యాక్టరీ కార్యకలాపాలను యాజమాన్యం నిలిపివేసింది. అలాగే ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించాలని పాటంశెట్టి సూర్యచంద్ర తహసీల్దార్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



దివీస్ ప్రతినిధులు అందజేసిన పుస్తకాలతో శృంగవృక్షం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కోదాడ, కృష్ణాపురం, తొండంగి, శృంగవృక్షం ప్రభుత్వ పాఠశాలల్లోని 760 మంది విద్యార్థులకు రూ.1.54 లక్షలు విలువైన నోటు పుస్తకాలను దివీస్ ప్రతినిధులు అందజేశారు. పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు కె.సత్య, ఎం.ఫణితేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



గోకవరంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గోకవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సీహెచ్‌సీ పరిధిలోని గోకవరం, సీతానగరం మండలాలకు చెందిన 52 మంది పారిశుధ్య కార్మికులకు సూపరింటెండెంట్ డాక్టర్ వనజాకుమారి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఈసీజీ, ఎక్సరే తీశారు. కామెర్ల నివారణకు ముందస్తు రక్షణగా వ్యాక్సిన్లు వేశారు. కార్మికులకు అబా, పీఎంజీఏవై కార్డులు పంపిణీ చేశారు. విధి నిర్వహణలో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

తునిలో 275 మందికి...

తుని: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం బీజేపీ తుని శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, సచివాలయ ఉద్యోగులకు 275 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తటవర్తి రాజా, జి.చిన్నారావు, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ స్వప్న, డాక్టర్ సుబ్బారావు, పూడి సత్యవేణి, బీజేపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు ఎన్‌సీహెచ్.నారాయణాచార్యులు, కార్యదర్శి వెలుగుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు



ఎరకాపురంలో ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్

శంఖవరం: ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు సాధించవచ్చని ఉద్యానశాఖాధికారి పి.అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పి.మల్లాపురం పంచాయతీ ఎరకాపురంలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్, నిమ్మ, టమాటా, మిరప, అరటి, మామిడి, జీడి మామిడి తదితర పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలను అందిస్తుందన్నారు. ప్రస్తుతం కూరగాయల పంటలకు డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. ఎక్కువ డిమాండ్ ఉన్న పంటలను పండించడం ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని తెలిపారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. కాగా పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ సుంకర రవిబాబు, వైస్ చైర్మన్ లోవరాజు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

స్వచ్ఛత.. అందరి బాధ్యత

గ్రామాల్లో జోరుగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు



సూరంపాలెంలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న పవర్ గ్రిడ్ ఉద్యోగులు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెంలో సోమవారం పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. పవర్ గ్రిడ్ డీజీఎం పవన్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ మేనేజర్ కోటేశ్వరరావు, చీఫ్ మేనేజర్ వీరేంద్ర, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

జగ్గంపేట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ కోరారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం జగ్గంపేటలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం, పారిశుధ్యం, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. అనంతరం మండల అధికారులు ప్రభుత్వం కార్యాలయాల ఆవరణలను శుభ్రం చేశారు.

కార్యక్రమంలో తహసీల్దార్ జేవీఆర్ రమేష్, ఎంఈఓ స్వామి, పంచాయతీ కార్యదర్శి వత్సవాయి రాజస్‌రాజ్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రత్తిపాడు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ బందిలి సౌమ్య పిలుపునిచ్చారు. స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం దృష్ట్యా ప్రజలు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరాలు వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్య ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అనంతరం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు పారిశుధ్య కార్మికులు, రోగులకు వాటర్ బాటిల్, రొట్టెలను పంపిణీ చేశారు. రోగులకు వైద్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు చేసి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, పార్టీ ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు, బీజేపీ నాయకులు మదినే బాబ్జి, రామకుర్తి సూరిబాబు, దొంతంశెట్టి చంద్రశేఖర్, ఊటా బాస్కర్, సీహెచ్‌సీ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేస్తున్న అధికారులు



ప్రత్తిపాడులో కార్మికులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రావు తదితరులు

భూములకు పట్టాలు ఇవ్వాలంటూ ధర్నా



తహసీల్దార్ సరస్వతికి వినతి పత్రం అందజేస్తున్న లిబరేషన్ నాయకులు

గోకవరం: భూపతిపాలెం రెవెన్యూ పరిధిలోని భూములను ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట లిబరేషన్ సభ్యులు, భూములు సాగు చేసుకుంటున్న వారితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపతిపాలెంలో సర్వే నంబర్ 42, 43, 45, 46, 47లో భూములను మల్లవరం, కలిజోళ్లపేటకు చెందిన వైఆర్‌సీ నిర్వాసితులు, ఎస్సీ, ఎస్టీ రైతులు 25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. కనీసం వారికి నోటీసులు ఇవ్వకుండా సాగుదారులను బయటకు పంపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వారికి తక్షణమే పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు. లిబరేషన్ నాయకులు జక్కంపూడి రాజా, నాగులపల్లి అచ్చారావు, రమణ పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం మార్పు



జగ్గంపేటలో విద్యార్థులకు దుప్పట్లు, చాపలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: గ్రామంలో శిథిలావస్థకు చేరిన సాంఘిక సంక్షేమశాఖ బాలురు వసతి గృహాన్ని సోమవారం స్థానిక శివాలయం వద్ద ఉన్న తాత్కలిక భవనంలోకి మార్చారు. కొత్తగా ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో తాత్కాలిక భవనంలో విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. మండలంలో కొత్తూరులో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రామవరం వద్ద శిథిలావస్థకు చేరిన బాలురు వసతి గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో వర్షం

ప్రత్తిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సోమవారం మండలవ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నేలకు పదును చేరింది. మెట్టలో పండ్ల తోటలు, కూరగాయల పంటలకు వర్షం మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

ప్రజలకు మంచి చేయడమే లక్ష్యం

శంఖవరం: ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని పి.మల్లాపురంలో సోమవారం మంచి ప్రభుత్వం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నేరవేరుస్తుందని తెలిపారు. ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, తహసీల్దార్ పోతురాజు పాల్గొన్నారు.

ప్రజాప్రయోజనాలే లక్ష్యం

కోటనందూరు: ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మండలంలోని ఇండుగపల్లి, ఎస్సార్‌పేట, అప్పలరాజుపేట గ్రామాల్లో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం' నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గత వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన పనులను ప్రజలు వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని కోరారు.

సంక్రాంతి నాటికి సూపర్‌సిక్స్ పథకాలు

గోకవరం: వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి సూపర్‌సిక్స్‌లోని పథకాలన్నీ అమలు చేస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.